ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జయశంకర్ భూపాలపల్లి ములుగు
5
శనివారం 21 సెప్టెంబరు 2024



పండుగ కానుక అందేనా?!



- ఆడపడుచులకు బతుకమ్మ చీరల పంపిణీ ప్రశ్నార్థకం
- పవర్ లూమ్స్‌కు ఆర్డర్స్ ఇవ్వని సర్కార్
- స్వశక్తి సంఘాల ద్వారా పంపిణీ చేస్తామంటున్న సీఎం
- ఒక్కో మహిళకు రెండు చీరలు ఇస్తామంటూ ప్రకటన

భూపాలపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పేద మహిళలకు బతుకమ్మ పండుగ చీరల పంపిణీపై సందిగ్ధం నెలకొంది. గత ఏడేళ్లుగా మహిళలకు రాష్ట్ర ప్రభుత్వమే ఉచితంగా చీరలను పంపిణీ చేస్తోంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు బతుకమ్మ పండుగకు చీరల పంపిణీపై ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన బతుకమ్మ చీరల పథకం ఏడు సంవత్సరాల పాటు నిరాటంకంగా కొనసాగింది. కొవిడ్ సమయంలోనూ ఈ సంప్రదాయాన్ని ఆపలేదు. కానీ, ఈ ఏడాది తయారీదారులకు ఆర్డర్లు ఇవ్వకపోవడం.. బతుకమ్మ పండుగ ఇంకా కొద్ది రోజులు మాత్రమే ఉన్నప్పటికీ చీరల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం ఎలాంటి ఏర్పాట్లను ప్రారంభించకపోవడంతో ఈసారి లేనట్టేనని అధికారులు అంటున్నారు. ప్రతీ ఏటా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు ఒక కోటి చీరలను 250 రకాల డిజైన్‌లలో, 10కిపైగా ఆకర్షణీయమైన రంగుల్లో మహిళలకు పంపిణీ చేసేవారు. ఈ ఏడాది మాత్రం ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం వల్ల పేద మహిళలు ఉచితంగా చీరల నందుకోవడమే కాకుండా, నేత కార్మికులు, కార్మికులు, వాహనదారులు కూడా ఆర్థికంగా లబ్ధి పొందేవారు. ఈ పథకం ఆపివేయడం వల్ల ఆయా వర్గాలు ప్రభావితమయ్యే పరిస్థితి ఉత్పన్నమైంది. 2017 నుంచి ఏటా ప్రభుత్వం సుమారు రూ.330 కోట్ల నుంచి రూ.350 కోట్ల వరకు బడ్జెట్‌తో సుమారు ఒక కోటి చీరల కో సం ఆర్డర్లు ఇచ్చేది. అందులో 90 శాతం సిరిసిల్లలో తయారు చేయించేవారు, మిగతావి కరీంనగర్, వరంగల్‌లో తయారయ్యాయి. ఈ చీరల పంపిణీని రంజాన్, క్రిస్మస్ పండుగలకు కూడా కొనసాగించారు. గత ఏడాది బీఆర్ఎస్ ప్రభుత్వం 250 డిజైన్‌లలో 1.02 కోట్ల చీరలు పంపిణీ కేంద్రాలకు పంపింది. ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో పంపిణీని నిలిపివేశారు. అవి ఇప్పటికీ అలాగే ఉన్నాయని చెబుతున్నారు.

అయితే స్వశక్తి సంఘాల మహిళలకు కోటి 30 లక్షల చీరలు పంపిణీ చేసేందుకు త్వరలో ఆర్డర్ ఇవ్వబోతున్నట్లు ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా 63 లక్షల స్వయం శక్తి సంఘాల మహిళలు ఉన్నారని, గతంలో ఇచ్చిన బతుకమ్మ చీరల నాణ్యత సరిగ్గా లేకపోవడం వల్ల ఆ చీరలు ఎందుకు పనికిరాకుండా పోయాయని, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా, ఈ చీరల పంపిణీపై నేత కార్మికులు, ఇతర వర్గాల భవిష్యత్తు కూడా ఆధారపడి ఉన్నందున అన్నీ బేరీజు వేసుకొని ఒక్కో మహిళకు రెండు చీరలు చొప్పున పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. ఇప్పటికిప్పుడు ఆర్డర్ ఇచ్చినా ఆ చీరలు తయారు కావడానికి కనీసం నాలుగు నెలల సమయం పడుతుందని, ఈ నిర్ణయం ఏప్రిల్, మే మాసాల్లో తీసుకొని ఉంటే బతుకమ్మ పండుగకు చీరలు అందేవని నేత కార్మిక వర్గాలు చెబుతున్నాయి.

బతుకమ్మ చీరల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం బేషజాలకు పోవడం వల్లే ఈ పరిస్థితి ఉత్పన్నమైందని అంటున్నారు.

జిల్లాలో 1.14లక్షల మంది అర్హులు

భూపాలపల్లి జిల్లాలో ఈ ఏడాది బతుకమ్మ చీరల పంపిణీ ప్రక్రియకు బ్రేక్ పడినప్పటికీ త్వరలో ఒక కోటి 30లక్షల చీరలు పంపిణీ చేయబోతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన దరిమిలా జిల్లాలో ఉన్న తెల్ల రేషన్ కార్డుదారులందరూ చీరలు ఉచితంగా పొందేందుకు అర్హులుగా గుర్తించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ లెక్కన భూపాలపల్లి జిల్లాలో మొత్తం 1.14లక్షల మంది అర్హులు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో అత్యధికంగా భూపాలపల్లిలో 19,401 మంది, అత్యల్పంగా పలిమెల మండలంలో 2,087 మంది లబ్ధిదారులు ఉన్నారు. అయితే స్వశక్తి సంఘాల మహిళలని ప్రామాణికంగా తీసుకుంటే మాత్రం లబ్ధిదారుల సంఖ్య మరింత తగ్గే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.




నెత్తుటి చరిత

- మావోయిస్టు ఉద్యమానికి నేటికి 20ఏళ్లు
- పోరాటంలో కీలక నేతలను కోల్పోయిన దళాలు
- ఉద్యమ యోధులను బలితీసుకున్న కరోనా
- రాష్ట్ర కార్యదర్శి సహా పలువురు కేంద్ర, రాష్ట్ర కమిటీ నేతల మృతి
- ఇటీవలి ఎన్‌కౌంటర్‌లో నేలకొరిగిన ఓరుగల్లు విప్లవయోధులు
- ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన 27మందికిపైగా అజ్ఞాతంలోనే
- ఆటుపోట్ల మధ్య ఆవిర్భావ వేడుకలకు సిద్ధమైన మావోయిస్టులు

విప్లవాల పురిటి గడ్డ ఓరుగల్లు.. ఎన్నో నక్సల్స్ ఉద్యమాలకు వేదికగా నిలిచిన ప్రాంతం. నాటి పీపుల్స్‌వార్ నుంచి నేటి మావోయిస్టుల వరకు ఎంతో మంది పోరాటానికి మద్దతుగా నిలిచిన నేల. ఆపద వస్తే అడవి నుంచి అన్నలు వస్తారని ఎదురుచూసే అణగారిన ప్రజలున్న పోరుగడ్డ. నక్సల్స్ ఉద్యమానికి ఊపిరినిచ్చిన ఓరుగల్లు గడ్డపైనే తెలంగాణ తొలి ఎన్‌కౌంటర్ జరిగింది. నాటి నుంచి నేటి వరకు ఎంతోమంది యోధులు చిందించిన నెత్తురు ఓ చరిత్రను రాసింది. అయితే ప్రభుత్వంతో చర్చలు విఫలమైన అనంతరం 2004 సెప్టెంబరు 21న అప్పటి సీపీఐ (ఎంఎల్) పీపుల్స్‌వార్‌తో పాటు మరో రెండు విప్లవ సంఘాలు విలీనమై సీపీఐ (మావోయిస్టు)గా ఆవిర్భవించాయి. నాటి నుంచి నేటి వరకు మావోయిస్టులు పోరుబాటను వదల్లేదు. ఈ క్రమంలో ఎన్నో ఆటుపోట్లు.. ఓవైపు ప్రభుత్వం నుంచి అణచివేతలు.. మరోవైపు కరోనా లాంటి విపత్కర పరిస్థితులను ఎదురొడ్డారు. తుపాకీతూటాతో రాజ్యాధికారం సాధించాలన్న లక్ష్యంతో పోరుబాట సాగిస్తున్న క్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి హరిభూషణ్‌తోపాటు అనేక మంది మావోయిస్టులు కరోనాకు బలయ్యారు. 20ఏళ్ల మావోయిస్టు ఉద్యమ ప్రస్థానంలో ఎంతో మంది మావోయిస్టు నేతలు, మిలిటెంట్లు, ఇన్‌ఫార్మర్లతో పాటు పోలీసులు సైతం రక్తం చిందించారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



వివరాలు 7వ పేజీలో..

పాలకుర్తికి అరుదైన గౌరవం

- మహిళా యూనివర్సిటీకి ఐలమ్మ పేరు
- ఆమోదం తెలిపిన రాష్ట్ర మంత్రివర్గం
- హర్షం వ్యక్తం చేసిన స్థానిక ప్రజలు



వివరాలు 8వ పేజీలో...

ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక రూపొందించాలి

సమీక్షలో కలెక్టర్ రాహుల్‌శర్మ



కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 20: వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. భూపాలపల్లిలోని కలెక్టరేట్‌లో శుక్రవారం ధాన్యం కొనుగోళ్ల కార్యాచరణపై వ్యవసాయ, పౌరసరఫరాల, సహకార, గ్రామీణాభివృద్ధి, తూనికలు, కొలతల శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ 2024-25 వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం కావాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మౌలిక వసతులు కల్పించాలన్నారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి 2లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందన్నారు. అందులో 1.4వేల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం, 60వేల మెట్రిక్ టన్నుల దొడ్డురకం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానుందని తెలిపారు. వ్యవసాయ అధికారులు ఆయా మండలాల వారీగా ధాన్యం పండించిన రైతుల వివరాల నివేదిక ఆధారంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ కాంటాలను ఉపయోగించాలన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు చేసిన ధాన్యంను మిల్లలకు సరఫరా చేయాలని సూచించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారి విజయ్‌భాస్కర్, డీఎస్‌వో శ్రీనాథ్, డీఎం రాములు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ డెలివరీ త్వరగా పూర్తిచేయాలి

మిల్లర్లు సీఎంఆర్ డెలివరీని త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మిల్లర్లతో సమావేశం నిర్వహించిన కలెక్టర్ సీఎంఆర్ చెల్లింపులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 30వ తేది వరకు పెండింగ్ డెలివరీని పూర్తి చేయాలన్నారు. సీఎంఆర్ చెల్లించని మిల్లర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. 100 శాతం సిఎంఆర్ చెల్లించిన మిల్లర్లకు మాత్రమే ధాన్యం కేటాయిస్తామని తెలిపారు. సమావేశంలో డీఎం రాములు, డీఎస్‌వో శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బంగారుపల్లిని సందర్శించిన అదనపు కలెక్టర్

భారత్ ఎలక్ట్రానిక్స్ కంపెనీతో కంటెయినర్ పాఠశాల పరిశీలన



పిల్లలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంపత్‌రావు

కన్నాయిగూడెం, సెప్టెంబరు 20: మండలంలోని బంగారుపల్లి గొత్తికోయగూడెంలో ఇటీవల ఏర్పాటు చేసిన కంటెయినర్ పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) సంపత్‌రావు భారత్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ బృందంతో కలిసి శుక్రవారం పరిశీలించారు. పాఠశాలకు వచ్చిన కలెక్టర్‌కు, బృందానికి విద్యార్థులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం సంపత్‌రావు విద్యార్థులతో మాట్లాడారు. కంటెయినర్ పాఠశాల సౌకర్యంగా ఉందా.. ఏమైనా ఇబ్బందులు పడుతున్నారా.. అని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంపత్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలోనే మొదటిసారిగా కంటెయినర్ పాఠశాలను బంగారుపల్లిలో ఏర్పాటు చేయగా పరిశీలించినట్లు తెలిపారు. పాఠశాలలు లేని చోట భారత్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసేందుకు పరిశీలన కోసం వచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటనారాయణ, ఎంపీడీవో అనిత, నీతి ఆయోగ్ కోఆర్డినేటర్ రవిష్, ఉపాధ్యాయులు రాజేంద్రచారి, సరస్వతి, ఏపీవో సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మేడిగడ్డ బ్యారేజీలో కొనసాగుతున్న ఏడీసీపీ సర్వే



బ్యారేజీకి దిగువన ఏడీసీపీ సర్వే చేపడుతున్న శాస్త్రవేత్తలు

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 20: మహదేవపూర్ మండలంలో మేడిగడ్డ బ్యారేజీ ప్రవాహ తీవ్రతను కనుగొనేందుకు చేపట్టిన ఏడీసీపీ సర్వే శుక్రవారం కొనసాగింది. సీడబ్ల్యూపీఆర్ఎస్ శాస్త్రవేత్తలు నాగరాజు, వినాయక్ దాత్రక్ ఆధ్వర్యంలో బ్యారేజీ ఎగువ, దిగువ ప్రాంతాల్లో సర్వే చేపట్టినట్లు తెలిపారు. బ్యారేజీకి వచ్చే ఇన్‌ఫ్లో తగ్గుతూ, పెరుగుతూ ఉండటంతో ప్రవాహ తీవ్రతను నమోదు చేసేందుకు సర్వేను కొనసాగించారు. ప్రస్తుతం ఉన్న ప్రవాహం పెరిగినా, తగ్గినా శాస్త్రవేత్తలు అధ్యయనం కొనసాగించనున్నారు. వారి వెంట బ్యారేజీ డీఈ సురేష్, ఇతర ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

బ్యారేజీకి కొనసాగుతున్న వరద

కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. శుక్రవారం బ్యారేజీలోకి 1.06లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద 2.20 మీటర్ల ఎత్తులో ప్రవాహం కొనసాగుతోంది.



అడవి దారిలో దుర్గం గుట్టకు వెళ్తున్న కలెక్టర్ దివాకర, డీఎఫ్‌వో రాహుల్ జాదవ్

దుర్గం గుట్ట, బ్లాక్‌బెర్రీ అద్భుతం

- పర్యాటకంగా ఐలాండ్‌ల అభివృద్ధికి చర్యలు
- ములుగు కలెక్టర్ దివాకర

గోవిందరావుపేట, సెప్టెంబరు 20: గోవిందరావుపేట మండలంలోని దట్టమైన అటవీ ప్రాంతంలోని దుర్గం గుట్ట, తాడ్వాయి అడవుల్లోని బ్లాక్‌బెర్రీ ఐలాండ్‌లు అద్భుతంగా ఉన్నాయని జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. వీటిని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతామని తెలిపారు. డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్‌తో కలిసి శుక్రవారం ఈ రెండు ప్రాంతాలను సందర్శించారు. గుట్టలు, భారీ వృక్షాలను దాటుకుంటూ వెళ్లారు. దుర్గం గుట్టపై కాకతీయుల కాలం నాటి రాతిగోడ నిర్మాణం చూసి అబ్బురపడ్డారు. చరిత్రను అడిగి తెలుసుకున్నారు. అడవి విస్తీర్ణం, సంరక్షణ చర్యలను డీఎఫ్‌వో వివరించారు. బ్లాక్‌బెర్రీ ఐలాండ్‌ను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. ఇక్కడికి వచ్చే టూరిస్టుల కోసం సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. దుర్గం గుట్ట పైభాగంలో చుట్టూ రెయిలింగ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. బ్లాక్‌బెర్రీ ఐలాండ్‌లో పర్యాటకుల ఆటవిడుపుకు చర్యలు చేపట్టాలని సూచించారు. చరిత్ర, విశేషాలను తెలిపేందుకోసం గైడ్‌లను నియమించాలన్నారు. క్లాక్‌టవర్‌కు వెళ్లే మార్గంలో చెక్కతో మెట్లను అమర్చాలని డీఎఫ్‌వోకు సూచించారు. వారి వెంట ఏటూరునాగారం ఎఫ్‌డీవో వజ్రారెడ్డి, అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.



రక్తదానం చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

బీజేపీ పాలనలో దేశం పురోభివృద్ధి

మాజీ ఎంపీ సీతారాంనాయక్

రక్తదానం చేసిన నాయకులు, కార్యకర్తలు

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 20: బీజేపీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని, వికసిత భారత్ లక్ష్యంగా ప్రధాని మోదీ విప్లవాత్మకమైన చర్యలు చేపడుతున్నారని మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ అన్నారు. మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని ములుగులోని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, జిల్లా ఉపాధ్యక్షుడు జినుకల కృష్ణాకర్‌రావు, ములుగు మండల అధ్యక్షుడు గాదం కుమార్ సహా పలువురు నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సీతారాంనాయక్ మాట్లాడుతూ మోదీ 74వ జన్మదినం సందర్భంగా సేవాపక్షం నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. దేశం కోసం, ధర్మం కోసం మోదీ శక్తివంచన లేకుండా పని చేస్తున్నారని కొనియాడారు. సిరికొండ బలరాం మాట్లాడుతూ మోదీ జీవితాన్ని ప్రతీ కార్యకర్త ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రక్తదానం విలువైనదని, మోదీ బాటలో యువతీ యువకులు సేవా కార్యక్రమాలలో ముందు నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి, ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీంద్రచారి, బర్తపురం నరేష్, గంగిశెట్టి రాజ్‌కుమార్, కొత్త సుధాకర్‌రెడ్డి, మండల లవన్‌కుమార్, సూర్యదేవర విశ్వనాథ్, రవిరెడ్డి, నామవరపు విజయలక్ష్మి, చంద జ్యోతి, సురేష్, విక్రాంత్, దిలీప్, శ్రీహరి, రవీందర్‌రావు, కార్తీక్, రాజేష్, శశిధర్, ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కుండపోత వర్షం

విద్యుత్‌కు అంతరాయం

చీకట్లో భూపాలపల్లి పట్టణం



భూపాలపల్లి పట్టణంలో కురుస్తున్న వర్షం

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 20: భూపాలపల్లి పట్టణంలో కుండపోత వర్షం కురిసింది. బకెట్లతో నీళ్లను కుమ్మరించినట్లుగా సుమారు గంటపాటు వర్షం పడింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. జనం అతలాకుతలం అయ్యారు. వర్షం కురవడంతో విద్యుత్‌కు అంతరాయం కలిగింది. పిడుగులతో కూడిన వర్షంతో ఎక్కడ ఏ సమస్య తలెత్తిందో ఇంకా విద్యుత్ శాఖ అధికారులకు అంతుబట్టడం లేదు. సిస్టం ద్వారా గుర్తించే విధానం ఇంకా అందుబాటులోకి రాకపోవడంతో వెంటనే గుర్తించలేక పోతున్నామని అధికారులు తెలిపారు. భూపాలపల్లి పట్టణం చీకట్లో మగ్గుతోంది. విద్యుత్ అంతరాయంను గుర్తించి సరి చేయాలంటే.. కనీసం రెండు గంటలు పట్టవచ్చని అధికారులు చెప్పారు. అయితే సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమైన వర్షం 6.30 గంటల వరకు కురిసింది.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- డీఎంహెచ్‌వో అప్పయ్య

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 20: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు శుద్ధి చేసిన తాగునీరు, పౌష్టికాహారం తీసుకోవడం, నిత్యం వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అల్లెం అప్పయ్య అన్నారు. రాయినిగూడెం, గోవిందరావుపేట, పస్రా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో శుక్రవారం జరిగిన వైద్య శిబిరాలను పరిశీలించారు. వైద్యాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రతీ శుక్రవారం డ్రైడేను పాటించాలని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. పస్రా పీహెచ్‌సీని తనిఖీ చేసిన ఆయన రోగులను స్వయంగా పరీక్షించి మందులు అందజేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమాలలో వైద్యాధికారులు మధు, చంద్రకాంత్, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు లాభాల పంట

- 33 శాతం లాభాల వాటాను ప్రకటించిన ప్రభుత్వం
- దసరాకు ముందు కార్మికుల ఖాతాల్లోకి డబ్బులు
- సింగరేణి ఉద్యోగులకు తీపికబురు





కాకతీయఖని, సెప్టెంబరు 20: సింగరేణి ఉద్యోగుల నిరీక్షణకు తెరపడింది. ఎప్పుడెప్పుడా అని వేచిచూసిన లాభాల వాటాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎట్టకేలకు ప్రకటించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సింగరేణి ఆర్జించిన లాభాల్లో 33 శాతం వాటాను ఇవ్వనున్నట్లు శుక్రవారం వెల్లడించారు. దీంతో సింగరేణి కార్మికుల్లో హర్షం వ్యక్తమవుతుంది. సింగరేణికి మొత్తం నికర లాభం రూ.2388.5 కోట్లు రాగా, అందులో రూ.788.20 కోట్లు ఉద్యోగులు, కార్మికులకు యాజమాన్యం ఇవ్వనుంది. ఈ మొత్తాన్ని దసరా పండుగకు ముందు చెల్లించనున్నట్లు తెలిపారు. అయితే సింగరేణి భూపాలపల్లి ఏరియాలో 5,400 మంది ఉద్యోగులు పనిచేస్తున్నట్లు ఏరియా అధికారులు తెలిపారు. కాగా, వంద మస్టర్లు నిండని వారికి లాభాల్లో బోనస్ చెల్లించొద్దనే నిబంధన ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం సుమారు 200 మంది ఉన్నట్లు తెలుస్తోంది. మిగిలిన 5,200 మంది ఉద్యోగులకు లాభాల్లో వాటాను యాజమాన్యం త్వరలో చెల్లించనుంది.

సంస్థ గడించిన లాభాలు

సింగరేణి సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.2388.5 కోట్ల లాభాన్ని ఆర్జించినట్లు కార్మిక సంఘాల నాయకులు చెబుతున్నారు. అందులో నుంచి రూ.788.20 కోట్లు ఉద్యోగులకు చెల్లించనున్నట్లు తెలిపారు. దీంతో సగటున ఒక్కో ఉద్యోగికి రూ.1.88 లక్షలు రానున్నట్లు పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరం కేసీఆర్ ప్రభుత్వం 32 శాతం లాభాల వాటాను ప్రకటించగా ఈసారి రేవంత్‌రెడ్డి ఒక్క శాతం పెంచి 33 శాతం వాటాను ఉద్యోగులకు ఇస్తామని తెలిపారు.

కాంట్రాక్ట్ కార్మికులకు శుభవార్త

సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సీఎం రేవంత్‌రెడ్డి శుభవార్త అందించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల బోనస్‌ను అందించనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో సంస్థ గడించిన లాభాల్లో నుంచి ఒక్కో కాంట్రాక్ట్ కార్మికుడికి రూ.5వేలు చెల్లించనున్నట్లు ప్రకటించారు. దీంతో భూపాలపల్లి ఏరియాలో పనిచేస్తున్న సుమారు 800 మంది కాంట్రాక్ట్ కార్మికులకు లబ్ధి చేకూరనుంది.

మహబూబాబాద్‌లో నవోదయ, సైనిక్ స్కూళ్లను ఏర్పాటు చేయాలి



ఎంపీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 20: మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో నవోదయ, సైనిక్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, స్వేరోస్ ఇంటర్నేషనల్ నాయకుడు శనిగారపు రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం హనుమకొండలోని ఎంపీ పోరిక బలరాం నాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినయ్, సునిల్, వెంకట్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజల కోసం జీవితాన్ని ధారబోసిన కొండా లక్ష్మణ్‌బాపూజీ'

రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 20: ప్రజల కోసం తన జీవితాన్ని ధారబోసిన త్యాగశీలి కొండా లక్ష్మణ్‌బాపూజీ అని దేవాదాయ, ధర్మాదాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం కొండా లక్ష్మణ్‌బాపూజీ వర్ధంతి సందర్భంగా మంత్రి కొండా సురేఖ నివాళి తెలిపారు. జాతీయ ఉద్యమంలో తొలి, మలిదశ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర పోరాటాల్లో, సాయుధ రైతాంగ పోరాటంలో సహకార ఉద్యమంలో లక్ష్మణ్‌బాపూజీ పాత్ర అద్వితీయమైనదన్నారు. క్విట్ ఇండియా ఉద్యమకాలంలో బ్రిటీష్ రెసిడెన్సీపై జెండా ఎగురవేశారన్నారు. తొలిదశ తెలంగాణ ఉద్యమంలో మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా వదిలేయడమేకాక, 96ఏళ్ల వయసులో తెలంగాణ కోసం దీక్ష చేసిన గొప్ప వ్యక్తి లక్ష్మణ్‌బాపూజీ అని కొనియాడారు. విప్లవ పంథాను అనుసరించడంలోనూ పార్లమెంటరీ పంథాలో సాగటంలోనూ ఆయన పాత్ర అమోఘమన్నారు. లక్ష్మణ్‌బాపూజీ ఆధ్వర్యంలోనే దేశంలోనే ప్రప్రథమంగా సహకార సంఘాలు పురుడు పోసుకున్నాయని గుర్తుచేశారు. ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూం టెక్నాలజీకి సీఎం రేవంత్‌రెడ్డి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టినట్టు పేర్కొన్నారు.



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌తో భేటీ అయిన సుందర్‌రాజ్ తదితరులు

సుందర్‌రాజ్ యూ టర్న్

- కేటీఆర్ వద్దకు తీసుకెళ్లిన వినయ్‌భాస్కర్
- పార్టీ మారనని మాజీ కుడా చైర్మన్ స్పష్టీకరణ

రాంనగర్, సెప్టెంబరు 20: బీఆర్ఎస్‌ను వీడాలనుకున్న మాజీ కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యూటర్న్ తీసుకున్నారు. సుందర్‌రాజ్ పార్టీ వీడుతున్నట్లు రెండు రోజులుగా 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు ప్రచురించడంతో బీఆర్ఎస్ నేతలు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే పలువురు నేతలు పార్టీ వీడిన విషయం తెలిసిందే. పశ్చిమలో ఉన్న బలమైన బీసీ నేతను పోగొట్టుకోవడం సరికాదని నిర్ణయించి రెండురోజులుగా సుందర్‌రాజ్‌తో చర్చలు జరిపారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ శుక్రవారం సుందర్‌రాజ్‌ను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వద్దకు తీసుకెళ్లి మాట్లాడించాడు. భవిష్యత్ బీఆర్ఎస్‌దేనని, నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, మంచి అవకాశాలు వస్తాయని కేటీఆర్ హామీ ఇచ్చినట్లు సమాచారం. గతంలో మాదిరిగా పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనాలని కేటీఆర్ సుందర్‌రాజ్‌తో అన్నట్లు తెలిసింది. నేతల మధ్య ఏమైనా అభిప్రాయభేదాలు ఉంటే అంతర్గతంగా చర్చించుకుని పరిష్కరించుకోవాలని సూచించినట్లు సమాచారం. త్వరలోనే వరంగల్‌కు వస్తానని కేటీఆర్ తెలిపినట్లు సమాచారం. కాగా, కేటీఆర్‌తో భేటీ అయిన సుందర్‌రాజ్.. తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని పేర్కొన్నట్లు తెలిసింది. పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు ఇవ్వాలని సుందర్‌రాజ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను సూచించినట్లు సమాచారం.

ఫిట్స్‌తో ఇంటర్ విద్యార్థి మృతి

మడికొండ, సెప్టెంబరు 20: ఫిట్స్ రావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఇంటర్మీడియేట్ విద్యార్థి మృతి చెందాడు. మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ చిగురుమామిడి మండలం నవాబుపేటకు చెందిన బుర్ర మల్లేశం కుమారుడు బుర్ర రామ్‌చరణ్ (18) కాజీపేట మండలం భట్టుపల్లిలోని ఓ ప్రయివేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం కళాశాల ఉపాధ్యాయుడు ముద్దం సంతోష్ ఫోన్ చేసి తమ కుమారుడికి ఫిట్స్ రావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతున్నాడని, ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి రావాలని తెలిపాడు. ఆస్పత్రికి చేరుకున్న తమకు అప్పటికే తమ కుమారుడు మృతి చెందాడని తెలిపారు. మృతుడి తండ్రి మల్లేశం పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు.

నెత్తుటి చరిత్ర!



- మావోయిస్టు ఉద్యమానికి నేటికి 20ఏళ్లు
- పోరాటంలో కీలక నేతలను కోల్పోయిన దళాలు
- వరంగల్ ఉమ్మడి జిల్లాకు చెందిన 27మందికిపైగా అజ్ఞాతంలోనే
- ఆటుపోట్ల మధ్య ఆవిర్భావ వేడుకలకు సిద్ధమైన మావోయిస్టులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

సీపీఐ(మావోయిస్టు) ఉద్యమానికి నేటితో ఇరువై ఏళ్లు నిండాయి. 2004లో పీపుల్స్‌వార్ అగ్రనేతలు నాటి రాష్ట్ర ప్రభుత్వంతో చర్చల పేరిట మైదాన ప్రాంతాల్లోకి వచ్చారు. ఈ క్రమంలోనే పీపుల్స్‌వార్ రహస్య ప్రాంతాలపై గురి పెట్టిన పోలీసులు నక్సల్స్‌పై వల విసరటంతో తీవ్రంగా దెబ్బతిన్నారు. ఈ నేపథ్యంలో అప్పటి సీపీఐ (ఎంఎల్) పీపుల్స్‌వార్ నక్సల్స్ గ్రూపుతో దేశంలో బలమైన నక్సల్స్ ఉద్యమాన్ని నడుపుతున్న మరో రెండు విప్లవ సంఘాలైన మావోయిస్టు, కమ్యూనిస్టు సెంటర్ ఆఫ్ ఇండియా (ఎంసీసీ), సీపీఐ (ఎంఎల్) నక్సల్బరీ గ్రూపులతో కలిసి విలీనమై అదే ఏడాది సెప్టెంబరు 21న సీపీఐ (మావోయిస్టు)గా ఏర్పడ్డాయి. ఇలా శనివారం నాటికి మావోయిస్టు పార్టీ ఆవిర్భవించి 20ఏళ్లు. అయితే నాటి చర్చల అనంతరం మావోయిస్టు ఉద్యమంపై అప్పటి ప్రభుత్వం ఉక్కుపాదం మోపటంతో మావోయిస్టు దండకారణ్య ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్‌లోకి మకాం మార్చారు. రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలోని అడవులను కేంద్రంగా చేసుకుని నక్సల్స్ ఉద్యమాన్ని బలోపేతం చేస్తూ వస్తున్నారు. అయితే తెలంగాణలో ముఖ్యంగా ఉత్తర ప్రాంతంలో పూర్వవైభవం కోసం మావోయిస్టులు రెండు దశాబ్దాలుగా చేస్తున్న ప్రయత్నాలు పూర్తిగా సఫలం కాలేకపోతున్నాయి. ఈ 20ఏళ్ల కాలంలో మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలకు సరిహద్దులో ఉన్న భూపాలపల్లి, ములుగు, భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో తమ ప్రాబల్యం పెంచుకునేందుకు అనేక ప్రయత్నాలు చేస్తూ భారీ మూల్యాన్ని చెల్లించుకుంటోంది.

ఓరుగల్లులోనే తొలి ఎన్‌కౌంటర్..

2004లో మావోయిస్టు పార్టీగా ఆవిర్భవించిన తరువాత పదేళ్లు ఉమ్మడి రాష్ట్రంలో, మరో పదేళ్లు తెలంగాణ రాష్ట్రంలో మావోయిస్టులు ఉద్యమాలు చేస్తున్నారు. అయితే తెలంగాణ ఏర్పడితే తమ ఉద్యమానికి మరింత మద్దతు దొరుకుతుందని భావించిన మావోయిస్టులకు తొలి ఏడాదే భారీ షాక్ తగిలింది. అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం మవోయిస్టులకు తూటాతో సమాధానం చెప్పింది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం రంగాపూర్ అడవుల్లో 2015 సెప్టెంబరు 15న జరిగిన ఎన్‌కౌంటర్‌లో హనుమకొండ నగరంలోని వడ్డెపల్లికి చెందిన బీటెక్ విద్యార్థిని శృతి అలియాస్ మహిత(23), ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన విద్యాసాగర్‌రెడ్డి అలియాస్ సాగర్ మృతి చెందారు. తెలంగాణ ఏర్పడిన తరువాత జరిగిన తొలి మావోయిస్టు ఎన్‌కౌంటర్ ఓరుగల్లులోనే జరగటం అప్పట్లో విప్లవకారులు, తెలంగాణ వాదుల్లో చర్చనీయాంశంగా మారింది. ఇక 1991కాలంలో మావోయిస్టులు అనేక మంది కీలక నేతలను కోల్పోయారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ఎస్‌యూ నేత పులి అంజయ్య అలియాస్ సాగర్ రాష్ట్రకార్యదర్శిగా ఎదిగి 1991ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. ఆ తరువాత వరుసగా కేంద్ర కమిటీసభ్యులు నల్లా ఆదిరెడ్డి, శీలం నరేష్, ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డిలు భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం కొయ్యూర్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. ఆ తరువాత ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎదిగిన క్రాంతిరణదేవ్ అలియాస్ బక్కన్న, గుండెబోయిన అంజయ్య అలియాస్ బాలన్న, శెట్టిరాజ పాపయ్య అలియాస్ సోమన్న, గాజర్ల సారయ్య అలియాస్ ఆజాద్, తిప్పారపు రాములు అలియాస్ తాతా, బగే నాగేశ్వర్‌రావు అలియాస్ ప్రభాకర్ లాంటి కీలక నేతలు వేర్వేరు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందటంతో పార్టీ పెను సంక్షోభంలోకి వెళ్లింది.

కరోనాతో మావోయిస్టులు విలవిల

మావోయిస్టు పార్టీ గత 20 ఏళ్లలో ఎన్నడూ ఎదుర్కోని విపత్తును ఎదుర్కొంది. ఎన్నో ఎన్‌కౌంటర్లు, దాడులు, బాంబు బ్లాస్టింగులను ఎదుర్కొని ధైర్యంగా నిలిచి పోరాడిన మావోయిస్టు అగ్రనేతలు కరోనా నుంచి తప్పించుకోలేక పోయారు. దీంతో 2020-21 మధ్యకాలంలో పలువురు మావోయిస్టు కీలక నేతలు కరోనాతో మృతి చెందటం ఉద్యమానికి పెద్ద దెబ్బగా భావిస్తున్నారు. మావోయిస్టు ఉద్యమంలో కీలకంగా ఉన్న ఓరుగల్లుకు చెందిన అనేక మంది మావోయిస్టు అగ్రనేతలు మృత్యువాత పడ్డారు. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం మాడగూడెంకు చెందిన మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి యాప నారాయణ అలియాస్ హరిభూషన్ 2021 జూన్ 21న కరోనాతోనే మృతి చెందారు. అలాగే కేంద్ర కమిటీ సభ్యులు కత్తి మోహన్‌రావు అలియాస్ ప్రకాష్ 2021 జూన్ 10వ తేదీన కరోనా బారిన పడి గుండెపోటుకు గురై మృతి చెందారు. అలాగే ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన మాడ్ ఏరియా కార్యదర్శి సిద్ధబోయిన సారక్క అలియాస్ భారతక్క 2021 జూన్ 22న కరోనాతోనే కన్నుమూసింది. భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం ఒడితల గ్రామానికి చెందిన మ్యాదరి భిక్షపతి 2021 జనవరి 18వ తేదీన అనారోగ్యానికి గురై మృతి చెందారు. వీరితో పాటు సుమారు 10మందికి పైగా మావోయిస్టు నేతలు కరోనా బారిన పడి మృతి చెందినట్లుగా సమాచారం. అలాగే మావోయిస్టు పార్టీ అగ్రనేతలు బడే చొక్కారావు అలియాస్ దామోదర్‌తో పాటు అనేక మంది మావోయిస్టులు కరోనా బారిన పడ్డట్లు ప్రచారం జరిగింది. ఇలా ఎన్నిక సంక్షోభాలు ఎదురైనా ఎప్పటికప్పుడు కొత్త నాయకత్వాన్ని సృష్టిస్తూ ఆ లోటును భర్తీ చేసింది. కానీ ప్రస్తుతం ఆ కాలం నాటి రిక్రూట్‌మెంట్‌లు లేవు. దీంతో కరోనాతో కీలక నేతలను కోల్పోయినా మావోయిస్టులు వారి స్థానాలను భర్తీ చేయలేకపోతోంది. రాష్ట్ర కార్యదర్శి యాప నారాయణ మృతి తరువాత రెండున్నరేళ్ల వరకు నూతన కార్యదర్శిని నియమించలేకపోయింది. ఈ పరిణామాలు చూస్తుంటే కరోనా మహ్మారి మావోయిస్టు ఉద్యమంపై తీవ్ర ప్రభావం చూపిందనేది స్పష్టమవుతోంది.

మరో 27మందికిపైగా అజ్ఞాతంలో..

20ఏళ్ల ఉద్యమ ప్రస్థానంలో 1991-94కాలం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొన్న మావోయిస్టులు 30ఏళ్ల తరువాత 2021-24లో అంతకంటే పెను సంక్షోభంలో కూరుకపోయారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ప్రస్తుతం పోరుబాటలో ఓరుగల్లు నేతలే కీలకంగా వ్యవహరిస్తున్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన బడే చొక్కారావు అలియాస్ దామోదర్ మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. ఈ ఏడాది జనవరిలో దామోదర్‌ను పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించింది. ఇక కేంద్ర కమిటీ సభ్యుడిగా భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాలకు చెందిన గాజర్ల రవి అలియాస్ గణేష్ మావోయిస్టుల్లో కీలక నేతగా ఉన్నారు. ప్రభుత్వంతో జరిగిన చర్చల్లో గణేష్ మావోయిస్టుల చర్చల ప్రతినిధిగా వెళ్లారు. అలాగే ములుగు జిల్లా గోవిందారావుపేట మండలం మొద్దులగూడేనికి చెందిన కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్ ఏవోబీ కార్యదర్శిగా పని చేస్తున్నారు. ముప్పిడి బాబునావు, అంకేశ్వరం సారయ్యలతో పాటు పలువురు నేతలు కేంద్ర కమిటీలో కీలక బాధ్యతల్లో ఉన్నారు. వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాలో 18మందికి పైగా అజ్ఞాతంలో ఉండగా, భూపాలపల్లి జిల్లా నుంచి నలుగురు, ములుగు జిల్లా నుంచి ఐదుగురు మావోయిస్టులు ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్నారు. మొత్తంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 27మందికి పైగా నక్సల్స్ మావోయిస్టు ఉద్యమంలో అజ్ఞాతంలో ఉన్నట్టుగా సమాచారం.

ఒక్కొరొక్కరుగా నేలకొరుగుతూ..

మావోయిస్టు ఉద్యమంలో ఓరుగల్లు నేతలే కీలకంగా ఉండటంతో.. ఎక్కడ ఏ అడవుల్లో తుపాకీ పేలినా ఇక్కడి పల్లెల్లో అలజడి మొదలయ్యేది. ఆ ఎన్‌కౌంటర్‌లో తమ వారున్నారా అని చెమ్మగిల్లిన కళ్లతో కుటుంబీకులు ఎదురుచూసేవారు. 2010లో అప్పటి ప్రభుత్వం మావోయిస్టు నేతలను గుర్తించింది. అందులో కరీంనగర్ నుంచి 60మంది అజ్ఞాతంలో ఉండగా, ఉమ్మడి వరంగల్ నుంచి అత్యధికంగా 80మంది అజ్ఞాతంలో అదీ కీలక పదవుల్లో ఉన్నట్లు గుర్తించారు. ఈ 14ఏళ్ల కాలంలో 60శాతం మంది మావోయిస్టులు లొంగిపోవటమో, ఎన్‌కౌంటర్‌లో మృతి చెందటమో, అనారోగ్యంతో మృతి చెందారు. ఇటీవల కాలంలో ములుగు జిల్లా సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అనేక మంది మావోయిస్టులు మృతి చెందారు.

- ఈ ఏడాది ఏప్రిల్ 16న ఛత్తీస్‌గఢ్ కాంకేర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భూపాలపల్లి జిల్లా చల్లెగరిగే గ్రామానికి చెందిన సిరిపల్లి సుధాకర్ అలియాస్ మురళి అలియాస్ శంకర్‌రావు మృతి చెందారు. ఆయనతో పాటు ఆయన భార్య ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్‌కు చెందిన దాసెశ్వర్ సుమన అలియాస్ రంజిత కూడా మృతి చెందింది.
- ఏప్రిల్ 30వ తేదీన ఛత్తీస్‌గఢ్ అబూజ్‌మడ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన కేశనేని రవి అలియాస్ వినయ్ మృతి చెందాడు.
- జూలై 25వ తేదీన ములుగు- భద్రాద్రికొత్తగూడెం జిల్లా గుండాల, తాడ్వాయి మండలాల సరిహద్దుల్లోని దామెరతోగు, కరకగూడెం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భూపాలపల్లి జిల్లా గణపురం మండలానికి చెందిన పీఎల్‌జీఏ సభ్యుడు అశోక్ అలియాస్ విజేందర్ మృతి చెందాడు.
- ఈనెల 5వ తేదీన ఛత్తీస్‌గఢ్ దంతేవాడ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హనుమకొండ జిల్లా కాజీపేట మండలం టేకులగూడెం గ్రామానికి చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ మృతి చెందాడు.

చెస్‌పోటీల వాల్ పోస్టర్ ఆవిష్కరణ



చెస్ పోటీల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు20: వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22న హనుమకొండ టీడీడీ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు జిల్లాస్థాయి చెస్ పోటీలను వాల్ పోస్టర్‌ను శుక్రవారం హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి క్రీడాపోటీల నిర్వాకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏసీపీ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. చెస్‌తో మేధోసంపత్తి చేకూరుతుందని, జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలలో విద్యార్థులు రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో అండర్-15 బాలబాలికల విభాగంలో నిర్వహించనున్న చెస్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 4గురు బాలురు, 4బాలికలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్బిటర్స్ ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి మార్కెట్లో తడిసిన మొక్కజొన్నలు

ఓపెన్ యార్డులో వరదనీటిలో కొట్టుకుపోయిన మక్కలు

కేసముద్రంలో 600 బస్తాలకుపైగా తడిచిన సరుకు

కేసముద్రం (మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబర్ 20: ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఆకస్మాత్తుగా కురిసిన వర్షంతో మార్కెట్లో తడిచిపోవడంతో రైతులు తల్లడిల్లిపోయారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం 72మంది రైతులు 2,724 బస్తాల్లో 1,634 క్వింటాళ్ల మొక్కజొన్నలను విక్రయించేందుకు తీసుకు వచ్చారు. కొంతమంది రైతుల సరుకుల్లో తేమశాతం ఎక్కువగా ఉండడంతో ఓపెన్ యార్డులో ఆరబెట్టుకున్నారు. వీరిలో కొంతమంది ఈ-నామ్ లాట్ తీసుకున్నవారు సైతం ఉన్నారు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఆకస్మాత్తుగా కొద్ది నిమిషాలపాటు వర్షం కురవడంతో ఓపెన్ యార్డులో ఉన్న రైతులు తమ సరుకును కాపాడుకోలేకపోయారు. వర్షంలోనే తడుస్తూ మొక్కజొన్నలను దగ్గరకు కుప్పగా చేర్చారు. మహబూబాబాద్ మండలం వేమునూరు ఇందిరానగర్‌కు చెందిన భూక్య హుస్సేన్ ఎకరన్నరలో పండించిన మొక్కజొన్నలు తడిచిపోయాయి. గూడూరు మండలం పొనుగోడు రాములుతండాకు చెందిన భూక్య స్వామి, బానోత్ భద్రు, సాము, ఇనుగుర్తికి చెందిన బానోత్ వెంకన్నతో పాటు మరి కొంతమంది రైతుల సరుకులు పూర్తిగా తడిచి నష్టపోయారు. కొంతమంది టార్పాలిన్లు అందుబాటులో లేక నీటి వరదలో మొక్కజొన్నలు కొట్టుకుపోతున్నప్పటికీ చూస్తూ అలాగే ఉండాల్సిన దైన్యస్థితి నెలకొంది. దాదాపు 20 మంది రైతులకు చెందిన సుమారు 600 బస్తాల మొక్కజొన్నలు తడిచిపోయాయి.



కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో నీళ్లలో తడిచిన మొక్కజొన్నలను తీస్తున్న రైతు భూక్య హుస్సేన్

డిగ్రీ కళాశాల అడ్మిషన్ల మార్పులకు మరో అవకాశం

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 20: రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు పొందిన డిగ్రీ విద్యార్థులు తాము అడ్మిషన్లు పొందిన కళాశాలలోనే కోర్సులను మార్చుకునేందుకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి, దోస్త్, కళాశాల విద్యాశాఖాధికారులు మరో అవకాశం కల్పిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని ఏ డిగ్రీ కళాశాలలో నైనా డిగ్రీ కోర్సుల అడ్మిషన్లు పొందిన అభ్యర్థులు తమకు ఇష్టమైన కోర్సులకు మార్చుకుని చదువుకునేందుకు అవకాశం కల్పించినట్లు కమిషనర్ శ్రీదేవసేనా, చైర్మన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రిలు నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. సెప్టెం బరు 21 నుంచి 23 వరకు కళాశాలల కోర్సులు మార్పులు చేసుకోవచ్చునని వివరించారు. 24న తుది జాబితాను విడుదల చేస్తామని అధికారులు స్పష్టంచేశారు. వర్సిటీలోని అన్ని డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులు గమనించి తమ అర్హతల మేరకు తమకు ఇష్టమైన కోర్సులను అభ్యసించే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు.

23న కేయూలో సెనెట్‌హాల్‌లో సింపోజియం

హాజరుకానున్న హరగోపాల్, కోదండరామ్

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 20: కాకతీయ యూనివర్సిటీ ఎకనామిక్స్ విభాగం నేతృత్వంలో సెప్టెంబరు 23న ఉదయం 10గంటలకు డెకోడల్ డెవలప్‌మెంట్ ఆఫ్ తెలంగాణ స్టేట్-ఇష్యూష్ అండ్ చాలెంజెస్ అనే అంశంపై సింపోజం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో కేయూ అర్థశాస్త్ర విభాగాధిపతి, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ అధ్యక్షత వహిస్తారు. సింపోజింలో ముఖ్యఅతిథిగా ప్రముఖ సామాజిక వేత్త, సెంట్రల్ వర్సిటీ రిటైర్డు ప్రొఫెసర్ జి.హరగోపాల్, స్పెషల్ గెస్టుగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.కోదండరామ్, కీలక ఉపన్యాసకులుగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆర్థికశాస్త్ర విభాగం ప్రొఫెసర్ డి.నర్సింహరెడ్డి, కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డిలు పాల్గొననున్నారు.

డిగ్రీ ఇయర్ వైజ్ స్టూడెంట్స్‌కు పరీక్షలు నిర్వహించాలి

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 20: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఇయర్‌వైజ్‌లో డిగ్రీ, పీజీ కోర్సులు చదివిన పాత విద్యార్థులందరికీ పరీక్షలు నిర్వహించాలని కేయూ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అధ్యక్షుడు పి.ఉపేం దర్‌రెడ్డి జనరల్ సెక్రటరీ ఎం.ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం కేయూ పరిపాలన భవనంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారిలను వేర్వేరుగా కలిసి వినతి పత్రాలను అందచేశారు. వర్సిటీ పరిధిలోని బీఏ, బీకాం, బీఎస్సీతో పాటు ఇతర కోర్సులు చదివిన విద్యార్థులు ఒక్కటి , రెండు సబ్జెక్టులు తప్పిపోయి డిగ్రీ ఉత్తీర్ణత సాధించలేకపోయారని వారికీ మళ్లీ పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని వినతిపత్రంలో కోరారు. ఆఖరు చాన్స్‌గానైనా డిగ్రీ పాత విద్యార్థులకు వర్సిటీ ఉన్నతాధికారులు ఆలోచించి పరీక్షలను నిర్వహించాలని కోరారు. అలాగే యూడీఎఫ్ ఫీజులను తగ్గించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ కళాశాల మేనేజ్‌మెంట్ ప్రతినిధులు, విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఎంజీఎంలో అత్యాధునిక పరికరాల ఏర్పాటు

ఎంజీఎం అధికారులతో సమీక్షా సమావేశంలో వరంగల్ కలెక్టర్ సత్య శారద



సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 20: ఎంజీఎం ఆస్పత్రిలో అత్యాధునిక పరికరాలు అందించేందుకు పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ముందుకొచ్చినట్లు కలెక్టర్ సత్యశారద తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎంజీఎం సూపరింటెండెంట్ మురళి, ఆర్ఎంవో మురళి, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ డీజీఎం సమయ్యలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ఆర్ పనుల కింద వైద్య పరికరాల సరఫరా చేయడానికి పవర్ గ్రిడ్ ముందుకు రావడంపై కలెక్టర్ వారిని అభినందించారు. ఎంజీఎం ఆస్పత్రిలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన పరికరాల వివరాల నివేదికలు సమర్పించాలని ఎంజీఎం సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, తహసీల్దార్ ఇక్బాల్, పవర్‌గ్రిడ్ జూనియర్ ఇంజనీర్ సీహెచ్.సంపత్ పాల్గొన్నారు.

ఓపీ ల్యాబ్‌లో రోగుల కష్టాలు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 20: ఎంజీఎం ఆస్పత్రిలో ఓపీ విభాగంలో రోగుల కోసం ప్రత్యేకమైన ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ ల్యాబ్‌లోకి వెళ్లాలంటే రోగులు నరకయాతన అనుభవించాల్సిందే. రోగ నిర్ధారణకు అవసరమయ్యే సీబీపీ, ఎలక్ట్రోలైట్స్, షుగర్ పరీక్షల లాంటివి ఈ ల్యాబ్‌లో చేస్తారు. ప్రస్తుత సీజన్‌లో అధిక సంఖ్యలో రోగులు వస్తుండటంతో ఆ గదిలోకి పైకి ఎక్కాలంటే చుక్కలు కనబడుతున్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోగులు జారీ కింద పడుతున్నారని వాపోతున్నారు. గతంలో మందులు ఇచ్చే దగ్గరనే ఈ 47వ నెంబరు ల్యాబ్ ఉండేది. ఓపీ పక్కనే ఈ ల్యాబ్ ఉండటంతో చాలా సౌకర్యంగా ఉండేది. అధికారులకు ఏమైందో ఏమో కాని లేకుంటే తీసుకొచ్చి దూరాన ఏర్పాటు చేశారు. అది కూడా పైకి ఎక్కడానికి వీలు లేకుండా ఉందని రోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎంజీఎం అధికారులు రోగులకు అనువైన చోటికి ఓపీ సేవలను దగ్గర ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎంజీఎంలో ఫిర్యాదుల పెట్టెలు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 20: ఎంజీఎం ఆస్పత్రి పాలనను గాడిలో పెట్టేందుకు ఎంజీఎం ఆస్పత్రి ఆవరణలో ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేశారు. రోగులు తమకు కలుగుతున్న ఇబ్బందులను ఫిర్యాదుల రూపంలో రాసి ఈ బాక్సుల్లో వేయాల్సి ఉంటుంది. జిల్లా కలెక్టర్ వీటిని స్వయంగా తెరిచి సమస్యలు తెలుసుకున్నారు. ఎంజీఎంలో పదికిపైగా ఇలాంటి పెట్టెలను ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఇప్పటివరకు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇంకా మెరుగైన ఫలితాల కోసం ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేశారు. అదే విధంగా ఓపీ కౌంటర్ల సంఖ్యనుకూడా పెంచాలని అధికారులను ఆదేశించారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

బాలిక మృతదేహం తరలించడంలో వైఫల్యం

'ఎక్స్'లో సర్కారుపై కేటీఆర్ వ్యాఖ్యలు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 20: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో మృతి చెందిన గిరిజన బాలిక గీతిక (6)ను తరలించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. తన ఎక్స్ ఖాతాలో ఈ విషయంపై స్పందించారు. ప్రభుత్వ అంబులెన్స్ ఉండి కూడా గిరిజన బాలిక మృతదేహాన్ని స్వస్థలానికి తరలించకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఘటన ప్రభుత్వానికి అవమానకరం అని అన్నారు. రాష్ట్రంలో ఆరోగ్య వ్యవస్థ అధ్వాన్నంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యానికి ఇంది పరాకాష్టగా మిగులుందన్నారు.

వరంగల్ రైల్వే స్టేషన్‌లో 39 రైళ్లకు నోస్టాప్

- ఈనెల 25 నుంచి 29 వరకు అమలు
- కాజీపేట జంక్షన్‌లోనే హాల్టింగ్

గిర్మాజిపేట, సెప్టెంబరు 20: వరంగల్ - కాజీపేట ఎఫ్ క్యాబిన్ - హసన్‌పర్తి రైల్వేస్టేషన్‌ల మధ్య జరుగుతున్న మూడో లైన్ పనుల కారణంగా విజయవాడ - కాజీపేట - బల్లార్ష సెక్షన్‌లో ఈనెల 25 నుంచి 29 వరకు గరీబ్‌రథ్, వందేభారత్, గోదావరి, పద్మావతి, సింహపురి, తదితర 39 రైళ్లకు వరంగల్ రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ తాత్కాలికంగా ఎత్తివేసినట్లు దక్షిణమధ్య రైల్వే ముఖ్య పౌరసంబంధాల అధికారి ఎ.శ్రీధర్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈనాలుగు రోజుల పాటు గరీబ్‌రథ్, వందేభారత్, కాకినాడ ఎక్స్‌ప్రెస్ రైళ్లు వరంగల్‌కు బదులుగా కాజీపేటలో ఆగుతాయని, ఇతర రైళ్లు కూడా యథావిధిగా కాజీపేటలో ఆగుతాయని వెల్లడించారు.

కాజీపేటలో ఆగే రైళ్లు ఇవే..

ప్రస్తుతం వరంగల్‌లో మాత్రమే స్టాప్ కలిగి కాజీపేటలో స్టాప్‌లేని విశాఖపట్టణం - సికింద్రాబాద్ - విశాఖపట్టణం గరీబ్‌రథ్ రైళ్లు ఈనెల 25 నుంచి 29 వరకు, షాలిమార్ - సికింద్రాబాద్ ఏసీ ఎక్స్‌ప్రెస్ 25న, కాకినాడటౌన్ - లింగంపల్లి - కాకినాడటౌన్ కాకినాడ ఎక్స్‌ప్రెస్ రైళ్లు 26, 27 తేదీల్లో, టాటా - యశ్వంత్‌పూర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ 26న వరంగల్‌కు బదులుగా కాజీపేట రైల్వేస్టేషన్‌లో తాత్కాలికంగా ఆగుతాయని తెలిపారు.



యథావిధిగా కాజీపేటలో హాల్టింగ్

గూడూరు - సికింద్రాబాద్ - గూడూరు సింహపురి ఎక్స్‌ప్రెస్ రైళ్లు, విశాఖపట్టణం - సికింద్రాబాద్ - విశాఖపట్టణం గోదావరి ఎక్స్‌ప్రెస్ రైళ్లు, కాకినాడ పోర్ట్ - లింగంపల్లి - కాకినాడ పోర్ట్ గౌతమి ఎక్స్‌ప్రెస్ రైళ్లు, మణుగూరు - సికింద్రాబాద్ - మణుగూరు ఎక్స్‌ప్రెస్ రైళ్లు, మచిలీపట్టణం - బీదర్ - మచిలీపట్టణం ఎక్స్‌ప్రెస్ రైళ్లు, తాంబరం - హైద్రాబాద్ - తాంబరం చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, తిరుపతి - కరీంనగర్ - తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైళ్లు, తిరుపతి - సికింద్రాబాద్ - తిరుపతి పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైళ్లు, నర్సాపూర్ - నాగర్‌సోల్ - నర్సాపూర్ నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నాలుగు రోజులు వరంగల్‌లో ఆగకుండా యథావిధిగా కాజీపేట రైల్వేస్టేషన్‌లో ఆగుతాయని తెలిపారు. అలాగే విశాఖపట్టణం - మహబూబ్‌నగర్ - విశాఖపట్టణం ఎక్స్‌ప్రెస్ రైళ్లు, శాలిమార్ - హైద్రాబాద్ - శాలిమార్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్టణం - సాయినగర్‌షిర్డి - విశాఖపట్టణం ఎక్స్‌ప్రెస్ రైళ్లు, యథావిధిగా కాజీపేటలో ఆగుతాయని శ్రీధర్ తెలిపారు. సాయినగర్ షిర్డి - కాకినాడ పోర్ట్ - సాయినగర్ షిర్డి ఎక్స్‌ప్రెస్ రైళ్లు, శాలిమార్ - సికింద్రాబాద్ - శాలిమార్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు కాజీపేటలో ఆగుతాయని వెల్లడించారు. అలాగే యశ్వంతాపూర్ - నిజాముద్దీన్ - యశ్వంతాపూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈనెల 22నుంచి అక్టోబరు 7వరకు ప్రస్తుత కాచిగూడ - కాజీపేట - బల్లార్ష - నాగపూర్‌కు బదులుగా కాచిగూడ - నిజామాబాద్ - ముద్కెడ్ - పింపల్ కుటి నాగపూర్ మీదుగా ప్రయాణిస్తుందని పేర్కొన్నారు.

వరంగల్‌లో పనిచేయలేం.. ఖమ్మం పంపించండి..

మంత్రికి రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగుల మొర

రాంనగర్, సెప్టెంబరు 20: వరంగల్ జిల్లాలో పనిచేయలేమని, తిరిగి ఖమ్మం జిల్లాకు పంపించాలని రిజిస్ట్రేషన్‌శాఖ ఉద్యోగులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఎదుట మొరపెట్టుకున్నట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా ఖమ్మం జిల్లాకు చెందిన రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగులను వరంగల్‌కు, ఇక్కడి వారిని ఖమ్మం పంపించారు. ఖమ్మం నుంచి బదిలీపై వచ్చిన అటెండర్ నుంచి సబ్ రిజిస్ట్రార్ స్థాయి ఉద్యోగులు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరు జిల్లాల పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఆగస్టు మొదటివారంలో వరంగల్‌కు వచ్చిన ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏ రిజిస్ట్రేషన్ చేస్తే ఏమవుతుందోననే భయంతో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. నిబంధనల సాకుతో రిజిస్ట్రేషన్‌లు చేయడం లేదు. ఆస్తుల క్రయవిక్రయాల్లో సబ్‌రిజిస్ట్రార్‌లు ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు సమాచారం. కాగా, కొద్దిరోజుల్లోనే వరంగల్‌లో పనిచేయలేమని గుర్తించిన ఉద్యోగులు.. ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసినట్లు సమాచారం. ఏ మాత్రం అవకాశం ఉన్నా తిరిగి ఖమ్మం పంపించాలని కోరినట్లు తెలిసింది.

ముగిసిన రైల్వే సేఫ్టీ కమిషనర్ తనిఖీలు

కాజీపేట, సెప్టెంబరు 20: కాజీపేటలో రైల్వే సేఫ్టీ కమిషనర్ మాదవి రైల్వే ట్రాక్‌ల తనిఖీలు శుక్రవారంతో ముగిశాయి. రెండురోజులుగా ప్రత్యేక ట్రాలీలో కాజీపేట నుంచి వరంగల్ మీదుగా తిరిగి హసన్‌పర్తి వరకు నిర్మించిన మూడో రైల్వేట్రాక్‌ను పరిశీలించారు. కాజీపేట - హసన్‌పర్తి కోమటిపల్లి వద్ద నిర్మించిన సొరంగమార్గం సైతం పరిశీలించారు. ఈ సొరంగమార్గం వద్ద సేఫ్టీ కమిషనర్ కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలుస్తోంది. సొరంగమార్గంతోపాటు మూడోలైన్ నిర్మాణం అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు ఆదేశాలను జారీ చేసినట్లు రైల్వే ఉద్యోగులు తెలిపారు. సేఫ్టీ కమిషనర్ సొరంగమార్గం మూడోలైన్‌ల నిర్మాణంపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు రైల్వే ఉద్యోగులు తెలిపారు. ఫిట్‌నెస్ సర్టిఫై చేసిన అనంతరం ఈట్రాక్‌లపై ట్రయల్ రన్ చేయనున్నారని రైల్వే అధికారులు తెలిపారు.

పిడుగుపాటుకు యువకుడు మృతి



అల్లం ప్రవీణ్ (ఫైల్)

గార్ల (మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 20 : పిడుగుపాటుకు ఓ యువకుడు మృతి చెందగా, తల్లికి తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పాత పోచారంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని పాత పోచారం గ్రామానికి చెందిన అల్లం ప్రవీణ్ (22), తల్లి కోటేశ్వరితో కలిసి తమ భూమిలోని మిర్చి తోటలో పనులు చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా గాలిదుమారం, వానతో పాటు ఉరుములు, మెరుపులతో వారు పనులు చేస్తున్న ప్రదేశంలో పిడుగుపడడంతో ప్రవీణ్ స్పృహతప్పి పడిపోయాడు. పక్కనే ఉన్న తల్లి కోటేశ్వరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన పక్కపొలం రైతులు ప్రవీణ్‌ను చికిత్స నిమిత్తం ఆటోలో ఖమ్మంకు తరలిస్తుండగా మృతి చెందాడు.

వడదెబ్బతో రైతు మృతి

చిట్యాల, సెప్టెంబరు 20 : పత్తి చేనుకు పురుగుల మందు పిచికారి చేస్తూ ఎండ వేడిమిని తట్టుకోలేక ఓ వృద్ధ రైతు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని చల్లగరిగలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన రైతు బండారి సదయ్య(62) తనకున్న 4 ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నాడు. ఈక్రమంలో శుక్రవారం పంట చేనుకు పురుగుల మందు పిచికారీ చేస్తూ ఎండ తీవ్రతను తట్టుకోలేక చేను వద్దే కుప్పకూలిపోయాడు. నీళ్లు తీసుకుని వస్తున్న అతడి భార్య సరోజన గమనించి కేకలు వేయడంతో చుట్టుపక్కల రైతులు చేరుకున్నారు. ఆస్పత్రికి తరలిస్తుండగానే సదయ్య మృతి చెందాడు. కాగా, ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

చిట్యాల, సెప్టెంబరు 20: మండల కేంద్రానికి చెందిన తూటిచెర్ల నర్సయ్య, చల్లగరిగ గ్రామానికి చెందిన అల్లె రాజయ్య ఇటీవల మృతి చెందారు. కాగా, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు గట్ల తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల వధువంశీకృష్ణ, నాయకులు చిలుకల రాయకొంరు, గంగాదరి రవీందర్, జంపయ్య, రఘుపతి, కుమార్, రమేష్, బుచ్చిరెడ్డి, సంజీవ్ తదితరులు ఉన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 20: సీఎస్‌సీ హెల్త్‌కేర్ వెల్‌నెస్ సర్వీసెస్ సంస్థలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్ డివిజనల్ మేనేజర్ రామంచ సుమన్, ములుగు జిల్లా కోఆర్డినేటర్ బీరెల్లి శశిధర్ ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం బోర్డులో రిజిస్టర్ అయిన కార్మికులకు ఉచితంగా వైద్యపరీక్షలు చేసేందుకోసం ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ, జీఎన్ఎం, ఏఎన్ఎం, డిగ్రీ కోర్సులు చేసిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 22, 23 తేదీల్లో జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్‌క్వార్టర్ ఎదురుగా ఉన్న న్యాక్ సెంటర్ కార్యాలయంలో ముఖాముఖి పరీక్షలకు రెస్యూమ్, స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్, పాన్‌కార్డులతో హాజరు కావాలని తెలిపారు. వివరాల కోసం 9652076728, 9440846172 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన

కాటారం, సెప్టెంబరు 20: మండలంలోని రేగులగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని కాటారం-మంథని ప్రధాన రహదారిపై గల గంగారం క్రాస్‌రోడ్డు వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుపై ఎస్సై మ్యాక అభినవ్ శుక్రవారం అవగాహన కల్పించారు. గ్రామ పెద్దలు, వ్యాపార, వాణిజ్య దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించి సీసీ కెమెరాల ప్రయోజనాలు, వాటిని ఏర్పాటు చేసిన తర్వాత కమిటీ ఆధ్వర్యంలో మెయింటెనెన్స్ చేయడం గురించి వివరించారు. సీసీ కెమెరాల ఏర్పాటు కోసం వ్యాపారులు, ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

▸▸ డివిజనల్ పంచాయతీ అధికారి వీరభద్రయ్య

కాటారం, సెప్టెంబరు 20: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం అందరి బాధ్యత అని భూపాలపల్లి డివిజనల్ పంచాయతీ అధికారి వీరభద్రయ్య అన్నారు. మండలంలోని ధన్వాడ గ్రామ పంచాయతీలో పర్యటించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. స్వచ్ఛతా హీ సేవా మాసోత్సవాల్లో పాల్గొని ప్రజలకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. డ్రైనేజీల్లో చెత్తా చెదారం, ప్లాస్టిక్ బాటిల్స్ వేయొద్దన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను ఎంపీవో వీరస్వామి నేతృత్వంలో జీపీ కార్యదర్శులు నిర్వహించి అవగాహన ర్యాలీలు చేపట్టారు. కార్యక్రమాల్లో జీపీ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు ఉమాదేవి, నఫీర్‌ఖాన్, నాగరాజు, శ్రీనివాస్, జ్యోత్స్న, నవ్యశ్రీ, రాజశేఖర్, శంకర్, కృష్ణవేణి, సునిత, సురేష్, రాకేష్, సాయి, ప్రసన్న తదితరులు ఉన్నారు.

మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం డ్రై డే కార్యక్రమాలు, వైద్య శిబిరాలు నిర్వహించారు. వైద్యులు, సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. ఫీవర్ సర్వే నిర్వహించారు. దోమల వ్యాప్తి నివారణకు మందును గడ్డిపొదలు, మురికినీటి గుంటలు, డ్రైనేజీల్లో చల్లించారు. విలాసాగర్‌లో వైద్యశిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమాల్లో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మౌనిక, ఎంఎల్‌హెచ్‌పీలు సుమన్, వందన, ప్రియాంక, హెచ్‌పి సమ్మయ్య, కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ఏటూరునాగారం : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యమని రొయ్యూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుమలత అన్నారు. మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురం ప్రాంతానికి చెందిన కంకణాల గీతిక(6) విషజ్వరంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయంపై జిల్లా ఆరోగ్యశాఖ అధికారి అప్పయ్య ఆదేశాల మేరకు వైద్యాధికారి సుమలత శుక్రవారం గీతిక గృహాన్ని పారామెడికల్ సిబ్బందితో కలిసి సందర్శించి కారణాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుమలత మాట్లాడుతూ.. మెదడువాపు, సెప్టిక్ షాక్ కారణంగా గీతిక మృతి చెందిందని గుర్తించామన్నారు. అనంతరం ఆకులవారిఘణపురంలో ప్రాంతంలో ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



ధన్వాడలో ప్రజలతో మాట్లాడుతున్న డీఎల్‌పీవో వీరభద్రయ్య

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరమని కొండాయి వైద్యాధికారి ప్రణీత్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని కొండాయిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగాముందుగా గ్రామపంచాయతీ సిబ్బందికి హైల్త్ క్యాంపు నిర్వహించారు. వివిధ వ్యాధులతో బాధపడు తున్న 22 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఐదుగురు జ్వరంతో ఉండడంతో మలేరియా పరీక్షలు నిర్వహించగా, అందరికి నెగెటివ్ రిపోర్ట్ వచ్చిందన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు, సలహాలను అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ భాస్కర్‌రావు, కార్యదర్శి సతీష్, ఆశ కార్యకర్తలు లక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు సహకరించాలి

▸▸ కలెక్టర్ టీఎస్.దివాకర

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 20: ములుగు జిల్లా అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు సహకారమందించాలని జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర కోరారు. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులతో శుక్రవారం తన కార్యాలయంలో సమావేశమయ్యారు. అంతకుముందు వెంకటాపూర్ మండలంలోని నందిపహాడ్ గొత్తికోయ గూడాన్ని సందర్శించిన సంస్థ ప్రతినిధులు ఆదివాసీల జీవన విధానం, సమస్యలను తెలుసుకున్నారు. వైద్యం, ఆరోగ్యం అంశంలో వారికి ఎలాంటి మౌలిక వసతులు అవసరమో చర్చించారు. కలెక్టర్‌తో జరిగిన సమావేశంలో గొత్తికోయగూడెంలో ఆరోగ్యపరమైన సదుయాల కల్పనకు సహకారమందిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు తదితరులు పాలొన్నారు.

ప్రభుత్వ స్పందనపై నమ్మకముంది

▸▸ జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్

ములుగు, సెప్టెంబరు 20: సీఎంఆర్ ధాన్యం దిగుమతుల పాలసీ మార్పు విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందనే నమ్మకముందని జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కాట్రగడ్డ సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గోపు వాసుదేవరెడ్డి ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్‌కు తమ సమస్యలను విన్నవించడం జరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరింపజేస్తానని హామీ ఇచ్చారన్నారు. 14 శాతం తేమతో ధాన్యాన్ని ఇస్తూ క్వింటా సన్నవడ్ల మిల్లింగ్‌కు రూ.150, దొడ్డు వడ్లకు రూ.100 చార్జీలు చెల్లించాలని, పెండింగ్ బకాయిల విడుదలపై హామీ ఇస్తే ఖరీఫ్ ధాన్యం సేకరణకు మిల్లర్లమంతా స్వచ్ఛందంగా ముందుకు వస్తామని వారు స్పష్టం చేశారు.

వేస్ట్ టూ వెల్త్ పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 20: పాఠశాలల విద్యార్థులకు వేస్ట్ టూ వెల్త్ ఎగ్జిబిషన్‌పై పోటీలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సైన్స్ అధికారి బర్ల స్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని అన్నారు. అయితే ఎగ్జిబిట్‌లో ఇద్దరు విద్యార్థులు పాల్గొనవచ్చని, ఇందులో ఉత్తమ ఎగ్జిబిట్‌లను ఎంపిక చేసి మొదటి బహుమతిగా రూ.2వేలు, ద్వితీయ బహుమతిగా రూ.1000, తృతీయ బహుమతిగా రూ.800 అందజేయనున్నట్లు తెలిపారు. ఇందులో పాల్గొన్న ఉపాధ్యాయులకు కూడా టీఏ చెల్లించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లోని పాఠశాలలు, హాస్టళ్లలోని విద్యార్థులు పాల్గొనేలా సంబంధిత ప్రధానోపాధ్యాయులు సహకరించాలని, ఎంఈవోలు ప్రోత్సాహాన్నందించాలని కోరారు. పూర్తి వివరాలకు 8555045517 నంబర్‌ను సంప్రదించాలని, త్వరలో తేదీ, స్థలాన్ని ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మహదేవపూర్, సెప్టెంబరు 20: మహదేవపూర్ మండల కేంద్రానికి చెందిన బీజేపీ మండల నాయకుడు మంథని రాజేందర్ ఇటీవల గుండెపోటుతో మరణించాడు. విషయం తెలుసుకున్న మహదేవపూర్ వాసి ఠాకూర్ మహేందర్‌సింగ్ చలించి శుక్రవారం రూ.75వేలను వారి స్నేహితులు సంతోష్‌సింగ్, మల్లికార్జున్ సహకారంతో రాజేందర్ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో అయిలి సాంబమూర్తి, తడకల శ్రీనివాస్, కొంతం సంపత్, అభిషేక్, బల్ల శ్రావణ్‌కుమార్, సంతు పాల్గొన్నారు.

జడ్పీహెచ్ఎస్‌లో గ్రంథాలయం ప్రారంభం

కాటారం, సెప్టెంబరు 20: మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం గ్రంథాలయాన్ని ప్రారంభించారు. పాఠశాల వనరులతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయగా మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, హెచ్ఎం ఉమారాణిలు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహనీయుల జీవిత చరిత్రలు చదివి వారు ఎంత కష్టపడి చదివి ఎంచుకున్న లక్ష్యాలను సాధించారో తెలుసుకోవాలన్నారు. స్వచ్ఛంద సంస్థలతో మాట్లాడి పలు గ్రంథాలు, పుస్తకాలను సేకరించి గ్రంథాలయానికి అందజేస్తానని ఎంఎస్‌వో సంజీవరావు తెలిపారు. గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను చదివితే అంతర్గత నైపుణ్యాలు, చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవచ్చని హెచ్ఎం ఉమారాణి అన్నారు. ప్రతీ విద్యార్థికి గ్రంథాలయం పీరియడ్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడలకు సన్‌వ్యాలీ విద్యార్థులు

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 20: ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో జిల్లా స్థాయికి సన్‌వ్యాలీ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మీనం సతీష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న మండల స్థాయిలో భూపాలపల్లిలో నిర్వహించిన ఖోఖో, కబడ్డీ విభాగాలలో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని చెప్పారు. కాగా, వీరు జిల్లా స్థాయిలో పాల్గొననుండగా, విద్యార్థులను ఆయన అభినందించారు.

ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకోవాలి

▸▸ అదనపు డీఆర్డీవో గోవిందరావు

కాటారం, సెప్టెంబరు 20: స్వశక్తి సంఘాల మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు అధికారి గోవిందరావు అన్నారు. మండల కేంద్రంలోని మండల సమాఖ్య భవనంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంపై స్వయం సహాయక సంఘాల మహిళలు, వీవో ప్రతినిధులు, వీవోఏలకు అవగాహన కల్పించారు. కుట్టు కేంద్రాలు, ఎంటర్‌ప్రైజెస్, మీ సేవా కేంద్రాలు, సంచార చేపల విక్రయాలు, క్యాంటీన్స్, పాడిపరిశ్రమ, గొర్రెలు, మేకల పెంపకం, ఈవెంట్ మేనేజ్‌మెంట్, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్, బ్యూటీ పార్లర్స్ తదితర ఉపాధి అవకాశాలపై వివరించారు. పలువురు బ్యాంకు మేనేజర్లు మాట్లాడుతూ మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని రుణాల చెల్లింపులు సక్రమంగా చేస్తే ఎంత రుణమైనా ఇవ్వడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఏపీఎం లవకుమార్, ఎస్బీఐ, కేడీసీసీ, టీజీబీ మేనేజర్లు ప్రవీణ్‌కుమార్, హరిరాంనాయక్, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఫర్హానా బేగం, సీసీలు లక్ష్మి, లక్ష్మణ్, స్వర్ణలత, విజిత, కొమురయ్య, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సీతారాం మరణం దేశానికి తీరని లోటు

▸▸ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ కార్యదర్శి సాంబశివ

ఏటూరునాగారం, సెప్టెంబరు 20: ఎస్ఎఫ్ఐ పూర్వ జాతీయ అధ్యక్షుడు సీతారాం ఏచూరి మరణం దేశానికి తీరని లోటని ఆ సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి బీరెడ్డి సాంబశివ అన్నారు. ఏటూరునాగారంలో శుక్రవారం భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ములుగు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీతారాం ఏచూరి సంస్మరణ సభ ఏటూరునాగారం డివిజన్ కార్యదర్శి జాగటి రవితేజ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా సాంబశివ హాజరై మాట్లాడుతూ.. 1974లో ఎస్ఎఫ్ఐలో చేరి సీతారాం ఏచూరి జేఎన్‌యూ యూనివర్సిటీ సమస్యలపై పోరాడారని తెలిపారు. విద్యార్థి హక్కులపై పోరాడుతూనే కేంద్ర ప్రభుత్వాలతో ధైర్యంగా ముందు నిలిచి కొట్లాడారన్నారు. మూడు సార్లు జేఎన్‌యూ విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా పనిచేశారని గుర్తుచేశారు. 1984లో ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులుగా పనిచేశారని, దేశంలో ఎస్ఎఫ్ఐ ఎన్నో నిర్బంధాలు ఎదుర్కొని బలమైన విద్యార్థి సంఘంగా అన్ని విశ్వవిద్యాలయాలలో విజయబావుటా ఎగురవేసిందన్నారు. ఏచూరి విద్యార్థి సంఘంలో పనిచేస్తున్న సమయంలో అనేక ఉద్యమాలు, పోరాటాల గురించి అధ్యయనం చేస్తూనే ప్రపంచ దేశాలల్లో కమ్యూనిస్టు, కార్మిక ఉద్యమాలకు అండగా నిలిచారని ఆయన పేర్కొన్నారు. దేశం ఒక గొప్ప మేధావిని కోల్పోయిందని తెలిపారు. అనంతరం సభలో ఏచూరి మరణానికి సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఎమ్డీ.దావూద్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టీఎల్ రవి, మండల అధ్యక్షుడు ముక్కెర ధనుష్, నాయకులు స్వామి, హేమన్, నరేష్ పాల్గొన్నారు.



సంస్మరణ సభలో మాట్లాడుతున్న బీరెడ్డి సాంబశివ

ప్రెస్, పోలీసుల పేరుతో ముఠా వసూళ్లు

ఆరుగురిపై కేసు నమోదు

వాజేడు, సెప్టెంబరు 20: ఏజెన్సీలో కొందరు వ్యక్తులు ఈజీ మనీకి అలవాటు పడి దారి దోపిడీలకు పాల్పడుతున్న సంఘటనలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. ఈ ముసుగులో కొందరు వ్యక్తులు ప్రెస్, పోలీసుల పేరుతో అర్ధరాత్రి డబ్బులు వసూలు చేస్తున్నారు. తాజాగా అలాంటి సంఘటనే వాజేడు మండలంలోని 163వ జాతీయ రహదారి జగన్నాథపురం వై జంక్షన్ వద్ద చోటుచేసుకుంది. వాజేడు ఎస్సై హరీష్ తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో మంగపేట, ఏటూరునాగారం మండలాలకు చెందిన పల్లా రాంబాబు, పల్నాటి సతీష్, వద్ది కార్తీక్, మల్లెల కమలాకర్, వావిలాల జనార్దన్, తాడూరి మధుకర్‌లు ప్రెస్, పోలీసుల పేరుతో జగన్నాథపురం వై జంక్షన్ వద్ద వచ్చిపోయే వాహనాలను ఆపుతూ బెదిరింపులకు దిగసాగారు. ఈ క్రమంలో వద్ది కార్తీక్ చేతిలో స్టీల్ రాడ్ పట్టుకొని బెదిరిస్తున్నారు. ఏటూరునాగారం మండలానికి చెందిన ఎమ్డీ సద్దాం హుస్సేన్ అనే డీసీఎం వ్యాన్ డ్రైవర్ మండలంలోని అయ్యవారిపేట నుంచి ఏటూరునాగారం వైపు వెళ్తుండగా ఆపి రూ. 20వేలు ఇవ్వాలని, లేకుంటే కొడతామని, పోలీసుస్టేషన్‌లో కేసులు పెడుతామని బెదిరించారు. సద్దాం హుస్సేన్ వ్యాన్ దిగి సదరు వ్యక్తులను గుర్తుపట్టి అటుగా ఇతర వాహనాలను ఆపి బిగ్గరగా అరిచాడు. ఈ క్రమంలో సదరు ముఠా సభ్యులు పరారీ అయ్యారు. సద్దాం హుస్సేన్ ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా, పోలీసుల అదుపులో ఐదుగురు నిందితులు ఉన్నట్లు, మంగపేట మండలానికి చెందిన తాడూరి మధుకర్ పరారీలో ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా దారి దోపిడీలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.



స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై హరీష్

అత్యాచారం కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలుశిక్ష

గణపురం, సెప్టెంబరు 20: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడికి పోక్సో కేసుల ప్రత్యేక కోర్టు జడ్జి 20ఏళ్ల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... 2020, మే నెలలో బాలికపై అత్యాచారం జరిగినట్లు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై రాజన్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రేగొండ మండలం పొనగండ్ల గ్రామానికి చెందిన నిందితుడు ఎలబద్రి సురేష్‌పై పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదైనట్లు తెలిపారు. భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు నేతృత్వంలో దర్యాప్తు చేసి శుక్రవారం కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. జడ్జి నిందితుడికి 20ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ.10వేలు జరిమానా విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నేటి నుంచి మావోయిస్టు ఆవిర్భావ వేడుకలు

ఏటూరునాగారం, సెప్టెంబరు 20: మావోయిస్టు పార్టీ ఆవిర్భావ వేడుకలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ములుగు జిల్లా ఏజెన్సీలో పోలీసులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. దీంతో సీఆర్‌పీఎఫ్, గ్రేహౌండ్స్, స్పెషల్ పార్టీ, సివిల్ బలగాలు అడవుల్లో మొహరించి ముమ్మరంగా గాలింపు చేపడుతున్నాయి. ప్రతీ సంవత్సరం సెప్టెంబరు 21 నుంచి 27 వరకు వారం రోజుల పాటు మావోయిస్టు ఆవిర్భావ వారోత్సవాలు నిర్వహిస్తారు. అయితే.. మావోయిస్టు ప్రభావిత పోలీస్ స్టేషన్ల పరిధిలో క్షుణ్ణంగా తనిఖీలు చేసి అనుమానితుల పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. అపరిచితులకు ఆశ్రయమిస్తే చట్టరీత్యా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. గొత్తికోయగూడెంలలో ఇంటింటి తనిఖీలు చేపట్టారు.

ఫెర్రి పాయింట్లను పరిశీలించిన సీఐ

▸▸ అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచనలు



దమ్మూర్ వద్ద గోదావరి పరీవాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐ రాంచందర్ రావు

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 20: పలిమెల మండలానికి సరిహద్దుగా ఉన్న ఛత్తీస్‌ఘడ్ నుంచి మావోయిస్టులు తెలంగాణలోకి ప్రవేశించేందుకు అనుకూలంగా ఉన్న ఫెర్రి పాయింట్లను మహదేవపూర్ సీఐ రాంచందర్ శుక్రవారం పరిశీలించారు. మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో పలిమెల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన సీఐ సిబ్బంది విధుల నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం పలిమెల ఎస్సై తమాషారెడ్డితో కలిసి గోదావరి పరివాహక ప్రాంతంలో పర్యటించారు. పలిమెల మండలంలోని సర్వాయిపేట, దమ్మూరు, బూర్గుగూడెం, నీలంపల్లి, బండారిగూడెం, ముకునూర్ గ్రామాలను ఆనుకుని ఉన్న గోదావరి ఫెర్రి పాయింట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గోదావరి నదిలో చేపలు పట్టేవారితో మాట్లాడిన సీఐ అనుమానిత వ్యక్తులు ఫెర్రి పాయింట్ల ద్వారా తెలంగాణలోకి వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వారి వెంట టీఎస్ఎస్‌పీ, సివిల్, సిబ్బంది ఉన్నారు.

అర్హులందరికీ ఓటుహక్కు కల్పించాలి

చిట్యాల, సెప్టెంబరు 20: వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తయ్యే ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పించే విధంగా ఇంటింటి సర్వే నిర్వహించాలని రాష్ట్ర ఉప ప్రధాన ఎన్నికల అధికారి హరిసింగ్ అన్నారు. మండలంలోని చల్లగరిగ, తిరుమలపురం గ్రామాల్లో శుక్రవారం ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దిష్ట గడువులోపు పారదర్శకంగా ఓటరు నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. బూత్ స్థాయి సిబ్బంది ప్రతీ ఒక్కరి వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేసి భద్రపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చిట్యాల, భూపాలపల్లి తహసీల్దార్లు హేమ, శ్రీనివాస్, ఎన్నికల డీటీ ఇమాంబాబా, ఆర్ఐ బాస్కర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సర్వే పరిశీలన

ములుగు, సెప్టెంబరు 20: ములుగు మండలం ఇంచర్లలో శుక్రవారం జరిగిన ఓటరు జాబితా సవరణ ఇంటింటి సర్వేను జిల్లా ప్రత్యేకాధికారి చెన్నయ్య పరిశీలించారు. ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ విజయభాస్కర్, బీఎల్‌వోలతో కలిసి పర్యవేక్షించారు. నిబంధనల ప్రకారం జాబితా సవరణ జరగాలని సూచించారు. నూతన ఓట్ల నమోదుపై అవగాహన కల్పించాలన్నారు.

హామీ ప్రకారం పదోన్నతులు కల్పించాలి

గణపురం, సెప్టెంబరు 20: మండలంలో కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు ప్రారంభంలో తమకు ఇచ్చిన మాట ప్రకారం పదోన్నతులు కల్పించాలని భూనిర్వాసిత ఉద్యోగులుకోరారు. శుక్రవారం సీఈ కార్యాలయంలో పలు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. భూసేకరణ సమయంలో ఇచ్చిన హామీ, పుట్టిన తేదీ ఆధారంగా పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మాధవరావు, సదానందం, రాజేశ్వర్‌రావు, కిరణ్‌రెడ్డి, శ్రీనివాస్, కుమారస్వామి, మల్లిక్, అరుణ్, సత్యనారాయణ, మొగిలయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

చిట్యాల, సెప్టెంబరు 20: భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ వైస్ చైర్మన్ నాగపూరి రాజమౌళి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామ స్థాయిలో ప్రజలకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ సంఖ్యలో పార్టీ అభ్యర్థులను గెలిపించుకునే విధంగా కష్టపడాలని సూచించారు. సమావేశంలో మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్, నాయకులు గుండ సురేష్, తీగల జగ్గయ్య, మాచర్ల రఘు, అనీల్, వెంకన్న, రాఘవరెడ్డి, రాయిని శ్రీనివాస్, మైదం శ్రీకాంత్,ప్రవీణ్, సంపత్, రాజు పాల్గొన్నారు.

ఇసుక లారీలతో ఇబ్బందులు పడుతున్నాం

అంబట్‌పల్లిలో లారీలను అడ్డగించిన గ్రామస్తులు

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 20: పలిమెల మండలంలోని పంకెన, మహదేవపూర్ మండలంలోని అంబట్‌పల్లి ఇసుక క్వారీల్లో లోడింగ్ కోసం వెళ్లే లారీలను అంబట్‌పల్లి గ్రామస్తులు ఆ గ్రామ కూడలి వద్ద శుక్రవారం అడ్డుకున్నారు. ఈ రెండు క్వారీలకు అంబట్‌పల్లి మీదుగానే వెళ్లే వీలుండటం.. మరే రూటు లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. సమయ పాలన లేకుండా ఇష్టారీతిన లారీలు వెళ్తుండటంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు లారీలు అతివేగంతో గ్రామం మీదుగా రాకపోకలు సాగిస్తుండటంతో చిన్నపిల్లలు, వృద్ధులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్ణీత సమయంలోనే లారీలు నడిచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వాహన డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి

చిట్యాల, సెప్టెంబరు 20: ప్రైవేటు వాహనాలు నడిపే డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని, రోడ్డు ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ మల్లేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రైవేటు వాహనాల యాజమానులు, డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలని, అసభ్యంగా, దురుసుగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. వాహనం రిజిస్ట్రేషన్, ఇన్సురెన్సు, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. పరిమితికిమించి ప్రయాణికులను వాహనాల్లో ఎక్కించవద్దని, రోడ్డు ప్రమాదాలకు గురై కుటుంబాలను ఆగం చేసుకోవద్దని, ప్రయాణికులను జాగ్రత్తగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రావణ్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై ఆటోడ్రైవర్లకు అవగాహన

మేడారం, సెప్టెంబరు 20 : మండలంలోని ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో 107 ఆటోలకు చెందిన డ్రైవర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన సూచనలు చేశారు. ప్రతి ఆటోడ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ప్రతి వాహనం ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, అధిక లోడ్, ఎక్కువ మంది ప్రయాణికులతో వాహనం నడపకూడదని సూచించారు. అనంతరం ఆటోలకు సీరియల్ నంబర్లు కేటాయించారు. డ్రైవర్ యూనిఫాంతో వచ్చిన ఇద్దరు డ్రైవర్లను అభినందించి గోడ గడియారాలు అందజేశారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు, పోలీసులు పాల్గొన్నారు.

పాలకుర్తికి అరుదైన గౌరవం

▸▸ మహిళా యూనివర్సిటీకి ఐలమ్మ పేరు

పాలకుర్తి, సెప్టెంబరు 20 : భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నడుం బిగించి విస్నూరు దేశ్‌ముఖ్‌పై తిరుగుబాటు చేసిన వీరనారి చాకలి ఐలమ్మకు అరుదైన గౌరవం దక్కింది. హైదరాబాద్‌లోని మహిళా యూనివర్సిటికి వీరనారి చాకలి ఐలమ్మ పేరును రాష్ట్ర ప్రభుతం ఖరారు చేసింది. శుక్రవారం కేబినేట్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు మహిళా యూనివర్సిటీకి ఐలమ్మ పేరు పెట్టేందుకు ఆమోదం తెలిపారు. నిరంకుశ విధానాలు, రాజరిక ప్యూడల్ వ్యవస్థలకు వ్యతిరేకంగా తెలంగాణలో ఎన్నో ప్రజా ఉద్యమాలు వచ్చాయి. దీనిలో భాగంగా చాకలి ఐలమ్మ, కొమరంభీం, రాంజీ గోండు తదితర పోరాట యోధులు ఎందరో నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా స్వయం పాలన, ప్రజాస్వామ్య పరిరక్షణకై తమ తమ పంథాలో పోరాటాన్ని చేశారు. హైదరాబాద్‌లోని మహిళా యూనివర్సిటీకి ఐలమ్మ పేరు పెట్టడంతో యావత్ తెలంగాణ ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం చాకలి ఐలమ్మ వర్ధంతి, జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం పోరాట చరిత్రను భావితరాలకు అందించేందుకు మహిళా యూనివర్సిటీకి ఐలమ్మ పేరు పెట్టడం పాలకుర్తి ప్రాంతానికి గొప్ప వరమని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.